వైభవంగా కార్తీకమాస శివరాత్రి పూజలు


మెట్టుగుట్టపై శివపార్వతుల కల్యాణం


కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో అభిషేకం


ఖిలా వరంగల్: అనఘాష్టమి వ్రతంలో భక్తులు


అర్ధనారీశ్వరుడిగా మల్లన్న


శివాలయంలో అన్నపూజ

మడికొండ: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణాన్ని అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మాస శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు విష్ణువర్ధన చార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, దేవేందర్‌శర్మ, మణిశర్మ, సాయిశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి చక్కెరతో అభిషేకం

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలోని సహస్ర లింగానికి 90కిలోల చక్కెరతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నపూజ చేసి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే, కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత ఓంకారేశ్వర స్వామి ఆలయంలో అన్నపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయాల అర్చకులు, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, శ్రీను, రమేష్, పోశాలు, డాక్టర్ గోనె జగదీశ్వర్ పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడి అలంకరణలో మల్లన్న

కాజీపేట: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తుల సమక్షంలో మల్లికార్జునుడిని అర్ధనారీశ్వరుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు శివుడికి అర్చనలు, అభిషేకాలు జరిపించి నూతన వస్త్రాలతో దేవతామూర్తులను అలంకరించారు. ఇటీవల దాతలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అందించిన వెండి తొడుగులతో స్వామి వారికి అలంకరణ చేశారు. సాయంత్రం భక్తులు సహస్ర దీపారాధన చేశారు.

గణేష్‌నగర్ శివాలయంలో అన్నపూజ

దేశాయిపేట: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని దేశాయిపేట రోడ్డులోని 13వ డివిజన్ టీచర్స్‌కాలనీ గణేష్‌నగర్‌లోని ఆది మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శివుడికి అన్నపూజ, కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీరంగం శ్రీనివాస చారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి రాఘవులు, కోశాధికారి మోహన్, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో లలితా సహస్ర నామ పారాయణం, అనఘాష్టమి వ్రత పూజ నేతపర్యంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం, అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. మంచాల కృష్ణమూర్తి, శ్రీరాంరాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక, సుధాకర్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

హన్మకొండ: పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత పథకాన్ని హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాల అమలుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ సారంగం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ శ్రీమాన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగ సంఘాల శుభాకాంక్షలు

హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌కు సోమవారం వచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'నాయిని'ని కలిసిన రెడ్ క్రాస్ బాధ్యులు

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి అనంతరం నియోజకవర్గానికి వచ్చిన నాయిని రాజేందర్‌రెడ్డిని నగరంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్, బాధ్యులు పాపిరెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, పుల్లూరి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ'కు చట్టబద్ధత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

కాజీపేట: మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే వర్గీకరణ బిల్లు పెడతామంటూ గతంలో బీజేపీ నాయకులు హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా వర్గీకరణ బిల్లు ఆమోదించాలనే డిమాండ్‌తో ఈనెల 18, 19వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో మాదిగ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైసా ఉపేందర్, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొచ్చు ప్రవీణ్, పుల్ల రమేష్, బొక్క నిరంజన్, జోగు లింగస్వామి, దార రాజు, చిలుక రాజు పాల్గొన్నారు.

డిగ్రీలో డిటెన్షన్ ఎత్తివేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న డిగ్రీ విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో డిటెన్షన్ పద్ధతిని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ స్వేరో స్టూడెంట్స్ యూనియన్, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులు కేయూలోని ఎగ్జామినేషన్ బ్రాంచ్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు ఒక సంవత్సరంలో మూడు లేదా నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ అయితే డిటెన్షన్ పద్ధతిని కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో ఆ విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫెయిలైన విద్యార్థులు డిటెన్షన్‌తో ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితులుంటాయని వాపోయారు. విద్యార్థుల ఆందోళనతో అక్కడికి అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి అక్కడికి రాగా, ఆమెకు ఈ విషయమై విన్నవించారు.

వ్యాసరచన పోటీలో గురుకుల విద్యార్థి ప్రతిభ


ప్రశంస పత్రం అందుకుంటున్న విష్ణువర్ధన్

మడికొండ: నూతన విద్యా విధానం -2020పై నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో వర్ధన్నపేట (మడికొండ) గురుకుల బాలుర విద్యార్థి, బైపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్న మాస్టర్ ఆర్.విష్ణువర్ధన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ కుర్షీద్ తెలిపారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా రూ.10వేల నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాన్ని సోమవారం అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఆర్‌సీఓ విద్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వలంటీర్లు, పోలీసుల శ్రమదానం



కేయూలో శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సోమవారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేసి, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శశిధర్, డాక్టర్ సుజాత, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల శ్రమదానం

వరంగల్ క్రైం: ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వాహనదారులకు అడ్డంగా ఉన్న, సిగ్నల్స్ కనిపించకుండా అడ్డుగా ఉన్న చెట్లను హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు సోమవారం తొలగించి శ్రమదానం చేశారు. రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల కాగడాల ప్రదర్శన


కాగడాల ప్రదర్శనలో తపాలా ఉద్యోగులు

హన్మకొండ: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 12నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు తమ నిరసనలో భాగంగా సోమవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండలోని కాళోజీ విగ్రహం నుంచి తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ నివేదికలోని అనుకూల సిఫార్సులను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, తపాలా శాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు మర్రి కొమురారెడ్డి, నాయకులు అశోక్, చంద్రమౌళి, రజనీకాంత్, ఉదయ్ పవన్, యాసుపొద్దీన్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

నగరంలో నేడు.. రేపు

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట కురుమ కులసంఘం భవనంలో ఆయుష్, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత ఆయుర్వే వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కురుమ సంఘం మండల పరశురాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి ఆయుర్వేద సీనియర్ వైద్యులు వస్తున్నారని, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

ఖిలా వరంగల్: ఈనెల 18న వరంగల్ శంభునిపేట ఉర్సు సుభాష్‌నగర్‌లోని నాగేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి (ఈఓ) ఆర్.కమల, అర్చకుడు జాగర్లపూడి శ్రీరామశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.1116లు చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

19న జైహో 2వ జాతీయ సమ్మేళనం

నయీంనగర్: ఈనెల 19న ఆంధ్రప్రదేశ్ నెల్లూరు పెన్నానది తీరాన పల్లిపాడు గ్రామంలో సత్యాగ్రహ ఆశ్రమంలో జైహో 2వ జాతీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జైహో ఏపీ రాష్ట్ర కార్యదర్శి రాబర్ట్ ఖదిజ్ఞాసి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 102 సంవత్సరాల క్రితం మహాత్మాగాంధీ హస్తాలతో ప్రారంభమైన పినాకిని సత్యాగ్రహ (గాంధీ) ఆశ్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించనున్న జాతీయ సమ్మేళనానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాకేష్, మనీష్, ప్రవీణ్, సరోజన, మమత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

1న అయ్యప్పస్వామికి పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని ధర్మశాస్తా అయ్యప్ప భక్తసేవాశ్రమంలో వచ్చే జనవరి 1న అయ్యప్ప స్వామికి విశేష పూజలు, భక్తులకు మహా అన్నప్రసాదాల వితరణ చేయనున్నట్లు ఆలయ అర్చకుడు గణపతిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 97006 91129 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈద్గా అభివృద్ధికి కృషి చేయాలి


సురేఖ, మురళిని సన్మానిస్తున్న జబ్బార్, ముస్లింలు


కొండా దంపతులతో సిక్కులు

ఖిలా వరంగల్: ఈద్గా, మసీదు అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని మంత్రి కొండా సురేఖను ఈద్గా ప్రతినిధి, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ కోరారు. ఈమేరకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖను పలువురు ముస్లింలతో కలిసి హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో జబ్బార్ సోమవారం మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్: మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో అర్చకులు సన్మానించారు. అలాగూ. మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతులను నగరంలోని 26వ డివిజన్‌కు చెందిన సిక్కు మతస్తులు హైదరాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

యాచకులకు బ్లాంకెట్ల పంపిణీ


బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు


కాజీపేట రూరల్: భిక్షాటన చేసే యాచకులకు కాజీపేట రైల్వే దేవాలయ ప్రాంగణంలో కాకతీయ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెసరు తిలక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిలక్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ట్రస్ట్ ఆధ్వర్యంలో చలికాలంలో యాచకులకు బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈసారి కూడా 60మందికి అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాంపెల్లి శ్రీనివాస్, గాజుల సంపత్, ఇండ్ల కిరణ్‌కుమార్, కంటమ్ శ్రీనివాస్, సాధినేని సూర్యనారాయణ, పెసరు తిలక్‌కుమార్, బెరపాక పరశురాములు గోపాల్‌రావు, రమేష్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి చేయూత


చెక్కు అందజేస్తున్న గౌరు తిరుపతిరెడ్డి

హసన్‌పర్తి: వింత వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి ఏకశిల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. ఈమేరకు హసన్‌పర్తి మండలం ఏకశిల టెక్నో పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థికి రూ.70వేలు అందించారు. పెంబర్తిలోకి ఏకశిల టెక్నో పాఠశాలలో చిట్యాలు మండలం దేశాయితండాకు చెందిన భూక్య కోటేశ్వర్ అనే విద్యార్థి మూడో తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా ఆ విద్యార్థి వింతవ్యాధితో బాధపడుతుండడంతో హైదరాబాద్‌లోని లిటిల్ స్టార్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆస్పత్రి నుంచి చికిత్స మధ్యలోనే డిశ్చార్జ్ చేశారు. ఈవిషయం తెలుసుకున్న ఏకశిల చారిటబుల్ ట్రస్ట్, ఉపాధ్యాయులు, యజమాన్యంతో పాటు విద్యార్థులు ముందుకువచ్చి కొంత డబ్బు సేకరించి ఆ విద్యార్థికి అందించారు. కాగా, కోటేశ్వర్ చదువు బాధ్యత పాఠశాల భరిస్తుందని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. పదో తరగతి వరకు ఉచిత విద్యనందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కేడీ.స్వర్ణరాజ్, ఇన్‌చార్జ్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు నవీన్, రాజేందర్, ప్రశాంత్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి


సీఎంకు రాసిన లేఖను విడుదల చేస్తున్న శేషు

హన్మకొండ: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఎలాంటి ఆంక్షలు, నిబంధనలు లేకుండా ప్రభుత్వమే పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈ మేరకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖను హనుమకొండలో సోమవారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఇంజనీరింగ్ చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధం లేకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వమే పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని సూచించారు. పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద ప్రతి సంవత్సరం రెండువేల మంది బీసీ విద్యార్థులను విదేశాలకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ నాయకులు దారబోయిన సతీష్ రమేష్, బీసీ విద్యార్థి నాయకుడు జితేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వినియోగదారుల హక్కులను రక్షించాలి

నయీంనగర్: వినియోగదారుల హక్కులను రక్షించాలని గోవాలో జరిగిన జాతీయ వినియోగదారుల సదస్సులో సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు.

పార్కును సందర్శించిన విద్యార్థులు

ఖిలా వరంగల్: బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్ పార్కును వరంగల్ జిల్లా సంక్షేమాధికారి శారద ఆధ్వర్యంలో వర్ధన్నపేట, రాయపర్తికి చెందిన కేజీబీవీ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. విద్యాశాఖ కోఆర్డినేటర్ ఫోరెన్స్, డీహెచ్‌ఈడబ్ల్యూ టీం, సఖి అడ్మిన్ శ్రీలత, సూపర్‌వైజర్ పద్మలత, యూడీసీ కుమార్, డీసీపీఓ రాజు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


ప్రపంచ మానవ హక్కుల పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం వాల్‌పోస్టర్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి, అభ్యుదయ సేవా సమితి ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు, ప్రగతి సేవా సమితి కార్యక్రమ మేనేజర్ ఇక్బాల్ పాషా, ఈవీ.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆరోగ్యంపై అరూరి రమేష్ ఆరా

హసన్‌పర్తి: హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి సోమవారం వెళ్లారు. కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఉండడం వల్ల మాజీ మంత్రి కేటీఆర్‌తో రమేష్ మాట్లాడారు.

మంత్రి సీతక్కను కలిసిన ఈఈయూ నేతలు



హన్మకొండ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ) -327 నాయకులు హైదరాబాద్‌లో సోమవారం కలిశారు. ఈమేరకు సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వర్కింగ్ సీనియర్ ప్రెసిడెంట్ రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి శ్రీమతి, నాయకులు ఎం.బుచ్చయ్య గౌడ్, డీ.సదయ్య, రాంచందర్, వేణురెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే నాగరాజుకు శుభాకాంక్షలు



మడికొండ: వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కేఆర్.నాగరాజును మడికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఐనవోలులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట మండల అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, వస్కుల భాస్కర్, నాగరాజు, శ్రీనివాస్, నీలం వేణుయాదవ్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, దువ్వ విజయ్, కొప్పుల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

లైబ్రరీలో మరుగుదొడ్లు ప్రారంభం



హన్మకొండ: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్ల గదులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్ సోమవారం ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శశిజాదేవి, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, సిబ్బంది కుమారస్వామి, రాజేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్



నయీంనగర్: ఆరోగ్య రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా హనుమకొండ లష్కర్‌సింగారం ప్రాంతానికి చెందిన రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్‌కు గుజరాత్ అహ్మదాబాద్ యూరో ఏషియన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈమేరకు ప్రవీణ్‌కుమార్‌కు యూరో ఏషియన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ సెబాస్టియన్ మెండీస్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

శిలాఫలకం ధ్వంసం చేయడం సమంజసం కాదు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిలాఫలకాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేయడం సమంజసం కాదని వరంగల్ అర్బన్ జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని, ప్రభుత్వమే తిరిగి శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రాంబాబు



కేయూ క్యాంపస్: న్యూఢిల్లీలో ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 69వ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కాకతీయ యూనివర్సిటీకి చెందిన మాచర్ల రాంబాబును నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు శ్రీరాజ్‌శరణ్ షాహి సోమవారం తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రామన్నపేట: వరంగల్ ఎల్లంబజార్‌లో నివాసముంటున్న పేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన గంప రామానాథం (73) అనారోగ్య సమస్యలతో సోమవారం మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు పరామర్శించి సంఘం తరపున అంతిమ సంస్కార పథకం ద్వారా రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వల్లబు సూర్యనారాయణ, పుల్లూరు మధుసూదన్, పిన్నా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

కాళోజీ సెంటర్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లాలోని దివ్యాంగులకు ఈనెల 13న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: జర్మనీలో చదువుతో పాటు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 63022 92450, 79012 90580 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.